# వాస్తవ నేస్తం

తెలుగు దిన పత్రిక

ప్రతి సిరా చుక్కలో - వాస్తవం పక్కా...







సంపుటి : 2 సంచిక : 319 శుక్రవారం 12 జూలై 2024 పేజీలు : 8 వెల : 5/-

Published form Adilabad, Circulated by Hyderabad, Rangareddy, Medak, Sangareddy, Siddipet, Nalgonda, Medchal Malkajgiri


# రుణమాఫీ అడుగులు

- వచ్చే వారం నుంచే పంట రుణమాఫీ ప్రారంభించాలని భావిస్తోన్న కాంగ్రెస్ ప్రభుత్వం
- రైతు రుణమాఫీ కోసం ఆతృతగా ఎదురుచూస్తున్న రాష్ట్ర రైతులు
- ఇప్పటికే... పంట రుణమాఫీకి సంబంధించి... మార్గదర్శకాలు అధికారుల సిద్ధం
- మార్గదర్శకాలకు రెండు రోజుల్లో ఆమోద్రముద్ర
- 2లక్షల రూపాయల వరకు పంట రుణాలను మాఫీ చేసేందుకు... సుమారు 31 వేల కోట్లు అవసరమవుతాయని ప్రాథమిక అంచనా
- రుణమాఫీని మూడు దశలుగా అమలు చేయాలని భావిస్తోన్న సర్కార్



హైదరాబాద్

రైతు రుణమాఫీ... దీని కోసం తెలంగాణ రైతులు ఆతృతగా ఎదురుచూస్తున్నారు. ఆగస్టు 15లోగా రుణమాఫీ చేసి చూపిస్తామని లోక్‌సభ ఎన్నికల ముందు సవాల్ చేశారు సీఎం రేవంత్‌రెడ్డి. 2లక్షల వరకు ఉన్న రుణాలు మాఫీ చేస్తామని ప్రకటించారు. అన్నట్టుగానే వేగంగా అడుగులు ముందుకు వేస్తున్నారు. వచ్చే వారం నుంచే పంట రుణమాఫీ ప్రారంభించాలని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తోంది. ఇందు కోసం అవసరమైన నిధులను సమకూర్చుకుంటోంది. రెండు రోజుల్లోనే రుణమాఫీకి సంబంధించి మార్గదర్శకాలు విడుదల చేస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఇప్పటికే... పంట రుణమాఫీకి సంబంధించి... మార్గదర్శకాలను అధికారులు సిద్ధం చేశారు. ఆ ఫైల్ ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి టేబుల్‌పైకి వెళ్లింది. ఒకటి, రెండు రోజుల్లో మార్గదర్శకాలకు ఆమోద్రముద్ర పడుతుంది. తెలంగాణ రైతులకు రూ. 2లక్షల వరకు పంట రుణాలు మాఫీ చేయాల్సి ఉంది. 2018 డిసెంబర్ 12 నుంచి 2023 డిసెంబర్ 9వ తేదీ వరకు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని కేబినెట్ సమావేశంలో నిర్ణయించారు. ఆ సమయంలో తీసుకున్న 2లక్షల రూపాయల వరకు పంట రుణాలను మాఫీ చేసేందుకు... సుమారు 31 వేల కోట్లు అవసరమవుతాయని కూడా... కేబినెట్ ప్రాథమికంగా అంచనా వేసింది. దీంతో.. నిధుల సమీకరణను వేగవంతం చేసింది తెలంగాణ ప్రభుత్వం. ఇప్పటికే - మిగతా3లో



## బురద చల్లడం ఆపి.. ఓటమిని సమీక్షించుకోండి

- అధికారం కోల్పోయి ఏడు నెలలైనా బీఆర్ఎస్ పెద్దలు ఇప్పటికీ భ్రమాలోకం నుంచి బయటకు రాలేకపోతున్నారు
- లోపం ఎక్కడుందో సమీక్షించుకోవాల్సింది పోయి ప్రభుత్వంపై బురద చల్లడంపైనే దృష్టి పెట్టారు
- రాజకీయ పార్టీల గెలుపు ఓటములను ప్రజలే నిర్ణయిస్తారు
- వారి అభిమానం ఉన్నంతకాలమే ఏ రాజకీయ పక్షమైనా కొనసాగుతుంది
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

హైదరాబాద్

బీఆర్ఎస్ నేతలు తమపై బురద చల్లడం ఆపి ఓటమిని సమీక్షించుకోవాలని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సూచించారు. అధికారం కోల్పోయి ఏడు నెలలైనా బీఆర్ఎస్ పెద్దలు ఇప్పటికీ భ్రమాలోకం నుంచి బయటకు రాలేకపోతున్నారని విమర్శించారు. అసెంబ్లీ, లోక్ సభ ఎన్నికల భంగపాటు తర్వాత లోపం ఎక్కడుందో సమీక్షించుకోవాల్సింది పోయి ప్రభుత్వంపై బురద చల్లడంపైనే దృష్టి పెట్టారని మండిపడ్డారు. - మిగతా3లో



## రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

- రాష్ట్రవ్యాప్తంగా 140 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు
- ఆధార్ లింక్ కాకపోవడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో స్తంభించిన సేవలు
- యూడీఐఏలో ఈకేవైసీలో వెరిఫికేషన్‌లో సాంకేతిక సమస్య

హైదరాబాద్

తెలంగాణ వ్యాస్తంగా రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవల్లో అంతరాయం కలుగుతున్నది. ఆధార్ లింక్ కాకపోవడంతో రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో సేవలు స్తంభించాయి. యూడీఐఏలో ఈకేవైసీలో వెరిఫికేషన్ లో సాంకేతిక సమస్య తలెత్తింది. రిజిస్ట్రేషన్ల కోసం వచ్చిన జనం కార్యాలయం వద్ద పడిగాపులు కాశారు. ఇండ్లు, ప్లాట్ల క్రయ విక్రయాల కోసం స్లాట్ చేసుకున్న వారంతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల వద్ద గంటల తరబడి నిరీక్షించారు. గురువారం స్లాట్ బుక్ - మిగతా3లో



## రూపాయి వివాదం.. పరిష్కారానికి రూ. 50 వేలు

- ఇన్‌కమ్ ట్యాక్స్ నుంచి నోటీసు అందుకున్న అపూర్వ్ జైన్
- దానిని పట్టుకుని సీఏ వద్దకు వెళ్తే రూ. 50 వేల ఫీజు
- చివరికి ఆ నోటీసు రూపాయి వివాదానికి సంబంధించినదని తేలిన వైనం
- నెత్తీనోరూ బాదుకుంటూ సోషల్ మీడియాకెక్కిన అపూర్వ్ జైన్




## కొలువులు లేక యువత సతమతం

కొత్త ఉద్యోగాలపై గోయల్ గొప్పలు

- దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పెరిగాయి
- నిరుద్యోగిత రేటు రికార్డుస్థాయిలో ఉంటే వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయి
- ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పెరిగాయి
- గత ఏడాది 4.6 కోట్ల మందికి పైగా నూతన ఉద్యోగాలు అందుకున్నారు

# 24 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు!

- నేడు సమీక్ష నిర్వహించిన అసెంబ్లీ స్పీకర్, మండలి ఛైర్మన్
- హాజరైన ప్రభుత్వ విప్ లు, సీఎస్, డీజీపీ
- 24 నుంచి బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలని నిర్ణయం



హైదరాబాద్

ఈ నెల 24వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యే అవకాశం ఉంది. ఈ క్రమంలో శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ గురువారం మధ్యాహ్నం వివిధ శాఖల అధికారులతో అసెంబ్లీ నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, డీజీపీ జితేందర్‌తో పాటు ప్రభుత్వ విప్‌లు రామచంద్ర నాయక్, ఆది శ్రీనివాస్‌తో పాటు పలువురు హాజరయ్యారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల నేపథ్యంలో - మిగతా3లో




## నీట్-యూజీపై విచారణను ఈ నెల 18 వాయిదా

- కేంద్రం, ఎన్‌టీఏ దాఖలు చేసిన అఫిడవిట్లను స్వీకరించిన సుప్రీంకోర్టు
- వాదనలు జరిగే ముందు అఫిడవిట్లను పరిశీలించాల్సి ఉండడంతో కేసు వాయిదా
- ఐఐటీ మద్రాస్ డేటా అనలిటిక్స్ నివేదిక ఆధారంగా అవకతవకలు జరిగినట్లుగా, అసాధారణంగా అభ్యర్థులెవరికీ మార్కులు రాలేదని అఫిడవిట్‌లో పేర్కొన్న కేంద్రం



## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్‌కి ఏం తెచ్చాడు

- హైదరాబాద్ ఈమేజ్‌ని డ్యామేజ్ చేసేలా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారు
- హైదరాబాద్ నగరాన్ని బీజేపీ, బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేశాయి
- తెలంగాణకు నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరాం
- కిషన్ రెడ్డి కేంద్రమంత్రి కాగానే హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా కలిశా
- మాజీ మంత్రి కేటీఆర్ కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయారు
- మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం

# మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరం

**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జహీరాబాద్ పట్టణంలో కేంద్ర హెూం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ 53వ జన్మదినం పురస్కరించుకొని రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమం బిజెపి నాయకులు గొల్ల భాస్కర్, సుభాష్ రెడ్డి, విజేందర్ రెడ్డి, పూల సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బిజెపి సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీమతి గోదావరి అంజి రెడ్డి రావడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ నాయకులు కేంద్ర మంత్రి నిండు నూరేళ్లు ఆయుష్ ఆరోగ్యాలతో మరెన్నో జన్మదిన వేడుకలు నిర్వహించుకోవాలని, బిజెపి కార్యకర్తలను కనురెప్పలాగా చూసుకోవాలని బిజెపి పార్టీ రాబో ఎలక్షన్లో అధికారంలో రావాలని, బిజెపి నాయకులు కార్యకర్తలు సమాజ హితం కోసం ఎల్లప్పుడూ పనిచేస్తారని రక్తదానం చేసినటువంటి కార్యకర్తలను అభినందించారు. ఈ కార్యక్రమంలో బిజెపి అసెంబ్లీ కన్వీనర్ నౌబాద.జగన్నాథ్ సీనియర్ నాయకులు శ్రీనివాస్ గౌడ్, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర సహా కార్యదర్శి సుధీర్ బండారి, బిజెపి జిల్లా కార్యదర్శి అరుణా కవిలాస్ బిజెపి జిల్లా అధికార ప్రతినిధి బక్కయ్య గుప్తా, బిజెపి జిల్లా సహా కోశాధికారి శ్రీనివాస్ గుప్తా, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కిష్టన్న, బిజెపి పట్టణ అధ్యక్షులు విశ్వనాథ్ స్వామి, వివిధ మండల అధ్యక్షులు వైద్యనాథ్, ఓంకార్ యాదవ్, బంటు విశ్వనాథ్, ఎంజి దుర్గయ్య, నాయకులు సురేష్ పురి, సుమ అనిల్, ప్రశాంత్ పాటిల్, నరేష్ పాటిల్, విశ్వనాథ్ యాదవ్, బొగ్గుల సంతోష్, అప్పం శ్రావణ్ ,బాల్ రెడ్డి, గంగవారు మల్లేష్, సతీష్, శ్యామ్ రావు, బూద రాజు, దుర్గేష్, ప్రవీణ్, అర్చన శారద, నాగేందర్, రమేష్, దుర్గేష్, శ్రీధర్, వెంకట్, నర్సింలు, చంద్రశేఖర్, దేవరాజ్, కాశీనాథ్, తదితరులు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# రైతుల అభివృద్ధి కోసమే ప్రజల రైతు భరోసా పథకం

## - ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క





**వాస్తవ నేస్తం,ఆదిలాబాద్ బ్యూరో:** రైతుల అభివృద్ధి కోసం రైతు భరోసా పథకం ఎంతగానో ఉపయోగపడుతుంది అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. గురువారం ఆదిలాబాద్ జిల్లాలోని ఉట్నూర్ లోని పియంఆర్సి భవన్ లో రైతు భరోసా పథకం పై సమావేశం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన ఉప ముఖ్యమంత్రి, ఇతర మంత్రులను జిల్లా పాలనాధికారి రాజర్షి షా, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి కుష్బూ గుప్తా పూల మొక్కలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రైతు భరోసా పథకం అమలు విషయంలో స్పష్టమైన వైఖరితో ఉందని ఆన్నారు. దీనిపై అందరితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని, మాకు మేముగా ఏ నిర్ణయం తీసుకోమని స్పష్టం చేశారు. రైతుల అభిప్రాయాలను అన్నింటినీ క్రోడీకరించి నివేదిక రూపంలో శాసన సభ ముందు ఉంచుతామని, దీనిపై శాసన సభ్యుల అభిప్రాయాలను కూడా సేకరిస్తామని ఆన్నారు. న్యాయబద్ధంగా , ధర్మబద్ధంగా అందరికీ అందేలా చర్యలు చేపడతామని ఆన్నారు. ఈ పథకం దుర్వినియోగం కాకుండా చూస్తామన్నారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ రైతు భరోసా విషయం లో రైతుల ఆలోచన మేరకే నిర్ణయం తీసుకుంటుందని ఆన్నారు. రైతుల మనసులో ఏముందో తెలుసుకునేందుకే ఉమ్మడి జిల్లాల వారిగా సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో మాదిరిగా ప్రతీ సంక్షేమ కార్యక్రమాన్ని కూడా నిజమైన అర్హులకు అందేలా చూస్తామని , ప్రభుత్వ ఆలోచన కూడా ఇదేనని ఆన్నారు. రెవిన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. రైతు భరోసా విషయం లో నాలుగు గోడల మధ్య నిర్ణయం తీసుకోకుండా ప్రజలతో చర్చించి జిల్లాలో పర్యటిస్తున్నామని ఆన్నారు. ప్రజాభిప్రాయాని కనుగుణంగా రైతు భరోసా ఆన్నారు.జిల్లా ఇంఛార్జి మంత్రి సీతక్క మాట్లాడుతూ.. రైతు భరోసా పథకాన్ని ప్రభుత్వం రైతుల అభిప్రాయాలకు అనుగుణంగానే పక్కాగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటి వరకు ఈ పథకం పై ఎలాంటి పరిమితులు ఖారారు కాలేదని, అందరితో చర్చించిన తర్వాతే నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జిల్లా పాలనాధికారి మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీ ల పై ప్రజాపాలన లో అందిన దరఖాస్తుల ను పరిశీలించి అర్హులకు పథకాలను అందిస్తుందని పేర్కోన్నారు. అదే స్ఫూర్తి తో అర్హులైన రైతులకు న్యాయం చేయుటకు సబ్ కమిటీ నీ నియమించిందని ఆన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యులు వంశీ కృష్ణ, నగేష్, ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, వెడమ బోజ్జు, అనిల్ జాదవ్, ప్రేమ్ సాగర్ రావు, వివేక్, పాయల శంకర్, రామారావు పటేల్, పాల్వాయి హరీష్ బాబు, నిర్మల్ కలెక్టర్ అభిలాష అభినవ్, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దిపాక్, ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ దొత్రే, ఐటిడిఎ పిఓ ఖుష్బూ గుప్తా, వివిధ శాఖల అధికారులు, రెట్కుతులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ విజ్ఞప్తి

**న్యూఢిల్లీ :** ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్‌లో గతేడాది మేలో ఘర్షణలు చెలరేగాయి. దాంతో ఆ రాష్ట్రం అతలాకు తలమైంది. ఈ నేపథ్యంలో మణిపూర్‌ను సందర్శించాలని ప్రధాని నరేంద్ర మోదీకి ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ విజ్ఞప్తి చేశారు. ఆ రాష్ట్ర ప్రజల వేదన వినాలని ప్రధాని మోదీకి ఈ సందర్భంగా రాహుల్ గాంధీ సూచించారు. అందుకు సంబంధించిన 5 నిమిషాలు నిడివి గల ఓ వీడియోను గురువారం రాహుల్ గాంధీ తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. మణిపూర్ రాష్ట్రం రెండుగా విభజితమైందన్నారు. మణిపూర్‌లో ఘర్షణలు అనంతరం ఆ రాష్ట్రానికి తాను మూడోసారి వెళ్లానన్నారు. నాటికి నేటికి ఆ రాష్ట్రంలో పరిస్థితుల్లో ఏటువంటి మార్పు లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం రెండుగా విడిపోయిందన్నారు. ఆ రాష్ట్రంలో వేలాది మంది ప్రజలు ఇంకా పునరావాస కేంద్రాల్లోనే మగ్గిపోతున్నారని తెలిపారు. ఆ రాష్ట్రంలో ఇళ్లు కాలిపోతున్నాయి.. అమాయకుల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నాయి. వేలాది కుటుంబాలు సహాయక శిబిరాల్లో నివసించవలసి వస్తుందని రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో ప్రధాని మోదీ వ్యక్తిగతంగా ఒకసారి మణిపూర్‌లో పర్యటించి ప్రజల ఆవేదనను వినాలన్నారు. అలాగే రాష్ట్రంలో శాంతి నెలకొంటుందంటూ మణిపూర్ ప్రజలకు భరోసా కల్పించాలని ప్రధాని మోదీకి సూచించారు.



మరోవైపు మణిపూర్‌లో శాంతి నెలకోల్పాలంటూ పార్లమెంట్‌లో మోదీ ప్రభుత్వంపై కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమిలోని భాగస్వామ్య పక్షాలు ఒత్తిడి తీసుకు వచ్చాయని గుర్తు చేశారు. అయితే తమ పోరాటాన్ని మోదీ ప్రభుత్వం ఎలా నిర్వీర్యం చేసిందో అంతా చూశారన్నారు. జులై 8వ తేదీన ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మణిపూర్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా సహాయక శిబిరాల్లోనున్న ప్రజలతో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా ఓ మహిళ మాట్లాడుతూ.. తమకు భద్రత కల్పించాలన్నారు. తాము.. తమ ఇంటికి వెళ్లాలనుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నాళ్లిలా ఈ సహాయక శిబిరాల్లో తలదాచుకోవాలంటూ రాహుల్‌కు ప్రశ్నలు సంధించిన సంగతి తెలిసిందే. అలాగే మణిపూర్ పర్యటనలో భాగంగా రాహుల్ గాంధీ.. ఆ రాష్ట్ర గవర్నర్ అనసూయ ఉకేతో భేటీ అయ్యారు. అనంతరం రాహుల్ ఇంపాల్‌లో విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజలు అపదలో పడ్డారన్నారు. ఆస్తులన్నీ నాశమయ్యాయిని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో విపరీతమైన విషాదం నెలకొందన్నారు. గతంలో పరిస్థితులకు నేటి పరిస్థితులుకు చాలా మార్పు వచ్చి ఉండవచ్చని తాను భావించానని...కానీ పరిస్థితుల్లో ఎటువంటి మార్పు రాలేదని రాహుల్ గాంధీ ఈ విలేకర్ల సమావేశంలో స్పష్టం చేసిన సంగతి తెలిసిందే.

## ఉపాధ్యాయులను సన్మానించిన ఎడ్ల రమేష్



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** పటాన్చెరు నియోజకవర్గం అమీన్పూర్ మున్సిపాలిటీ బీరంగూడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జడ్పీ హెచ్ ఎస్ హై స్కూల్ లో 9 మంది ఉపాధ్యాయులు బదిలీ కావడం జరిగింది, ఉపాధ్యాయులకు గౌరవంగా సన్మానం చేసిన ఎడ్ల రమేష్ వారు చేసిన సేవలను విద్యార్థులకు గుర్తు చేసినారు నూతనంగా 12 మంది ఉపాధ్యాయులు బీరంగూడ జిల్లా పరిషత్ స్కూల్ కి రావడం జరిగింది నూతనంగా వచ్చిన ఉపాధ్యాయులకు ఘన స్వాగతం పలుకుతూ వారికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎడ్ల రమేష్ మాట్లాడుతూ గతంలో నా వంతు సహాయ సహకారాలు ఈ స్కూలుకి చేయడం జరిగింది అలాగే మున్ముందు కూడా నా వంతు సహకారం ఉంటాయని గుర్తుచేసి ఆర్థికంగా ఇబ్బందులు ఉన్న విద్యార్థులకు నా వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుందని వారికి గుర్తు చేయడం జరిగింది అలాగే పదవ తరగతిలో మంచి ఫలితాలు సాధించినందుకు విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.

## ఐదు ఉద్యోగాలకు వెయ్యి మందికిపైగా రాక..



**అహ్మదాబాద్:** ఐదు ఉద్యోగాల కోసం వెయ్యి మందికిపైగా అభ్యర్థులు తరలివచ్చారు. ఈ నేపథ్యంలో జాబ్ ఇంటర్వ్యూలో తొక్కిసలాట లాంటి గందరగోళ పరిస్థితి ఏర్పడింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. గుజరాత్‌లోని భరూచ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఈ నెల 9న అంకలేశ్వర్‌లోని హెూటల్ లార్డ్స్ ప్లాజాలో ఒక కెమికల్ సంస్థ వాక్-ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించింది. షిఫ్ట్ ఇన్‌ఛార్జ్, ప్లాంట్ ఆపరేటర్, సూపర్‌వైజర్, ఫిట్టర్, మెకానికల్, ఎగ్జిక్యూటివ్ జాబ్స్ కోసం వెయ్యి మందికిపైగా తరలివచ్చారు. కాగా, రెజ్యూమ్ కాపీలను చేతుల్లో పట్టుకున్న అభ్యర్థులు క్యూలో వేచి ఉన్నారు. హెూటల్ గేటు నుంచి లోపలకు వెళ్లేందుకు ప్రయత్నించారు. దీంతో తోపులాట జరుగడంతో తొక్కిసలాట వంటి పరిస్థితి ఏర్పడింది. ఈ సందర్భంగా రైలింగ్ ఒంగిపోగా దాని పై నుంచి కొందరు కిందపడ్డారు. ఈ నేపథ్యంలో గందరగోళానికి దారితీసింది. ఈ వీడియో క్లిప్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది.

## బద్రీనాథ్ జాతీయ రహదారిపై రాకపోకలు పునరుద్ధరణ

**ఉత్తరాఖండ్ :** ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాల కారణంగా బద్రీనాథ్ జాతీయ రహదారిపై విరిగి పడిన కొండ చరియలను తొలగించారు. దీంతో గురువారం నుంచి బద్రీనాథ్ జాతీయ రహదారిపై రాకపోకలు పున: ప్రారంభమైనాయి. ఈ మేరకు చమోలీ పోలీసులు వెల్లడించారు. ఉత్తరాఖండ్‌లో ఇటీవల ఎడతెరపి లేకుండా వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో ఛమోలీ జిల్లాలోని బహనీర్పానీ , జోషీమఠ్ రహదారిపై భారీగా కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో సదరు జాతీయ రహదారిపై వాహనాలు ఎక్కడివక్కడ నిలిచిపోయాయి. అలాగే బద్రీనాథ్ జాతీయ రహదారిపై బుధవారం పాతాళ గంగా లంగసీ టనల్ వద్ద భారీగా కొండ చరియలు విరిగిపడ్డాయి. దీంతో రహదారిపై రాకపోకలను నిలిపివేశారు. ఆ యా రహదారులను సైతం ఈ రోజు పునరుద్ధరించారు. ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. దాంతో ఆ యా పరిసర ప్రాంతాల్లో రహదారులపై కొండ చరియలు విరిగిపడ్డాయి. ఇక జులై 5వ తేదీన సైతం బద్రీనాథ్ వద్ద ఇటువంటి పరిస్థితి నెలకొన్న సంగతి తెలిసిందే. మరోవైపు బద్రీనాథ్‌లో దైవ దర్శనం చేసుకుని బైక్‌పై వస్తున్న హైదరాబాద్‌కు చెందిన దంపతులపై భారీ కొండ చరియలు విరిగిపడ్డాయి. ఈ ప్రమాదంలో ఆ దంపతులు అక్కడికక్కడే మరణించిన సంగతి తెలిసిందే.

## వాల్మీకి కార్పొరేషన్ స్కామ్‌లో రూ. 100 కోట్లు కొట్టేసిన కాంగ్రెస్

వాల్మీకి కార్పొరేషన్ స్కామ్ కేసు దర్యాప్తులో వెలుగుచూసిన అంశాలు కాంగ్రెస్ తీరును బట్టబయలు చేశాయని బీజేపీ ఎంపీ, బీజేవైఎం చీఫ్ తేజస్వి సూర్య అన్నారు. ఈ స్కామ్ కాంగ్రెస్ పార్టీకి ఎస్టీల అభివృద్ధి పట్ల ఉన్న చిత్తశుద్ధిని వెల్లడిస్తోందని చెప్పారు. ఈ స్కామ్‌లో నిందితుడు రూ. 100 కోట్ల నిధులను వివిధ బ్యాంకు ఖాతాలు, షెల్ ఖాతాలకు మళ్లించారని తెలిపారు. నిందితుల్లో ఒకరు హైదరాబాద్‌లోని ఓ డీలర్ నుంచీ లగ్జరీ కారు కొనుగోలు చేసినట్టు వెల్లడైందని చెప్పారు. దేశంలో ఓబీసీ, ఎస్సీ, ఎస్టీల రక్షకుడిగా చెప్పుకునే రాహుల్ గాంధీ ఎందుకు తమ సీఎంపై చర్యలు చేపట్టలేదని తాను ప్రశ్నిస్తున్నానని అన్నారు. గిరిజన అభివృద్ధికి మీ మోడల్ ఇదేనా అని కాంగ్రెస్ నేతలను తేజస్వి సూర్య నిలదీశారు. ఈ స్కామ్‌పై ఈడీ దర్యాప్తునకు ప్రయత్నిస్తుంటే రాష్ట్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ ఏజెన్సీలు సహకరించడం లేదని ఆరోపించారు. సీఎం, డిప్యూటీ సీఎం ఈ కేసు దర్యాప్తు నుంచి దృష్టి మళ్లించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు.వాల్మీకీ కార్పొరేషన్ స్కామ్‌పై నిష్పాక్షికంగా దర్యాప్తు జరగాలని తాము కోరుకుంటున్నామని తేజస్వి సూర్య స్పష్టం చేశారు.

## కొలువులు లేక యువత సతమతం

దేశంలో నిరుద్యోగం తాండవిస్తూ ఉపాధి లేక యువత సతమతమవుతుంటే ఉద్యోగాల కల్పనలో మోదీ సర్కార్ ముందువరసలో నిలిచిందని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ విస్తుగొలిపే వ్యాఖ్యలు చేశారు. నిరుద్యోగిత రేటు రికార్డుస్థాయిలో ఉంటే వాస్తవాలు అందుకు భిన్నంగా ఉన్నాయంటూ గోయల్ గొప్పలు చెప్పారు. దేశంలో ఉపాధి కల్పనపై ఆర్బీఐ వెల్లడించిన తాజా నివేదిక మోదీ సర్కార్‌లో పెరిగిన నూతన ఉపాధి అవకాశాలు, నూతన ఉద్యోగాలు అందుబాటులోకి వచ్చిన తీరును కండ్లకు కడుతున్నదని మంత్రి పేర్కొన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో దేశవ్యాప్తంగా ఉపాధి అవకాశాలు పెరిగాయని చెప్పుకొచ్చారు. 1981-82 తర్వాత తొలిసారిగా గత ఏడాది రెండున్నర రెట్లు అధికంగా ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. గత ఏడాది 4.6 కోట్ల మందికి పైగా నూతన ఉద్యోగాలు అందుకున్నారని చెప్పారు. ఇది 6 శాతం అధికమని వెల్లడించారు. 2022-23లో అతితక్కువగా 3.2 శాతం నిరుద్యోగిత రేటు

# బురద చల్లడం ఆపి.. ఓటమిని సమీక్షించుకోండి

-మొదటిపేజీ తరువాయి

ఈరోజు(గురువారం) గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో మంత్రి శ్రీధర్‌బాబు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజాక్షేత్రంలోకి వెళ్లి ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపితే స్వాగతిస్తాంమని తెలిపారు. నిస్పృహతో కూడిన ప్రకటనలతో గందరగోళాన్ని కప్పిపుచ్చుకోవడం వల్ల ప్రజయోజనం ఉండదని చెప్పారు. రాజకీయ పార్టీల గెలుపు ఓటములను ప్రజలే నిర్ణయిస్తారని అన్నారు. వారి అభిమానం ఉన్నంతకాలమే ఏ రాజకీయ పక్షమైనా కొనసాగుతుందని తెలిపారు. ఇంత జరిగినా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ తీరులో ఏమాత్రం మార్పు రాలేదని ప్రజలు పెదవి విరుస్తున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు సచివాలయానికి రాకుండా నివాసం నుంచే పాలన సాగించారని ధ్వజమెత్తారు. కనీసం ప్రతిపక్ష నేతగానైనా ఆయన జనం మధ్యకు



వెళ్తారనుకున్నామని కాని ఇంట్లోనే కూర్చుని కార్యకర్తలను తనవద్దకు రప్పించుకుంటున్నారని దెప్పిపొడిచారు. కాంగ్రెస్ పార్టీ యాదృచ్ఛికంగా అధికారంలోకి వచ్చిందని ఇప్పటికీ ప్రచారం చేస్తుండటం వాళ్ల ఆలోచనలో ఏమాత్రం మార్పు రాలేదని తెలిసిపోతోందని చెప్పుకొచ్చారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ 64 స్థానాలు గెల్చుకుందని... బీఆర్ ఎస్‌కు దక్కింది 39 మాత్రమే. 25 సీట్ల ఆధిక్యతను మర్చిపోతున్నారన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో 2019 లో 9 స్థానాలు గెల్చిన ఆ పార్టీ సున్నాకే పరిమితమైందని సెటైర్లు గుప్పించారు. ఇది ప్రజలిచ్చిన తీర్పు కాదా? అయినా ఓటమితో దిష్టి తొలగిందని సమర్థించుకోవడం ఏంటి? అని ప్రశ్నించారు. మళ్లీ అధికారంలోకి వచ్చి 15 ఏళ్లు అధికారంలో ఉంటామని గాంభీర్యాలకు పోవడం కలలో జీవించడం కాదా అని ఎద్దేవా చేశారు. అధికారంలో ఉన్న పార్టీ ప్రజలకు ఏలోటూ రాకుండా చూసుకుని మళ్లీ మళ్లీ గెలుస్తాం అనడంలో హేతుబద్ధత ఉందని తెలిపారు. నేలమట్టమైన పార్టీని నాలుగున్నరేళ్ల తర్వాత అధికారంలోకి తీసుకొచ్చి 15 ఏళ్లు నిరాటంకంగా పరిపాలిస్తామని కలలు కంటున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ ది తార్కికతకు దగ్గరగా లేని అందమైన ఊహ అనుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు విమర్శించారు.

# రుణమాఫీ అడుగులు

-మొదటిపేజీ తరువాయి




10వేల కోట్ల రూపాయల వరకు సమకూర్చుకున్నట్టు తెలుస్తోంది. మిగతా 21 వేల కోట్ల రూపాయలు సేకరించేందుకు మార్గాలు అన్వేషిస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్‌లో 4వేల కోట్లు, మేలో 4వేల కోట్లు, జూన్‌లో 5వేల కోట్ల రూపాయల చొప్పున మార్కెట్ రుణాలను సేకరించారు. జులై, ఆగస్టు నెలల్లో తీసుకునే మార్కెట్ రుణాల్లోనూ కొన్ని నిధులను రుణమాఫీకి మళ్లించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జులైలో 6వేల 500 కోట్లు.. ఆగస్టు నెలలో 5వేల కోట్లు రుణం తీసుకోవాలని భావిస్తోంది. అలాగే... హైదరాబాద్ చుట్టుపక్క లున్న ప్రభుత్వ భూములను ప్రైవేట్ బ్యాంకుల్లో తాకట్టు పెట్టి... రుణాలు తీసుకోవాలని కూడా ఆలోచిస్తోంది. ఆ విధంగా మరో 10వేల కోట్ల రూపాయలు సమకూర్చుకోవాలని కసరత్తు చేస్తోంది తెలంగాణ ప్రభుత్వం. రుణమాఫీని మూడు దశలుగా అమలు చేయాలని తెలంగాణ ప్రభుత్వం భావిస్తోంది. ముందుగా లక్ష రూపాయల వరకు పంట రుణాలు మాఫీ చేయనుంది. ఆ తర్వాత ఒకటిన్నర లక్ష వరకు ఉన్న పంట రుణాలు మాఫీచేసి... చివరిగా మూడో దశలో రెండు లక్షల వరకు ఉన్న రైతు రుణాలు మాఫీ చేయాలని ఆలోచిస్తోంది. ఇలా చేస్తే... కాస్త ఆర్థిక భారం తగ్గించుకోవచ్చని... నిధుల సమీకరణకు కూడా సమయం ఉంటుందనేది తెలంగాణ ప్రభుత్వం యోచన. అయితే... మూడ విడతల్లో రుణమాఫీ చేసినా... మొత్తం ప్రక్రియ రోజుల వ్యవధిలోనే పూర్తిచేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఏది ఏమైనా... వచ్చే వారంలో.... అంటే ఈనెల 15 తర్వాత రుణమాఫీని ప్రారంభించే అవకాశం ఉందని.. ప్రభుత్వ వర్గాలు చెప్తున్నాయి. రైతు రుణమాఫీతోపాటు.. రైతు భరోసాపై కసరత్తు చేస్తోంది కాంగ్రెస్ ప్రభుత్వం. రైతు భరోసా విధివిధానాలు ఖరారు చేసేందుకు... ఇప్పటికే రైతు భరోసా సదస్సులు నిర్వహిస్తోందిఖమ్మంతో మొదలుపెట్టి... ఈనెల 22 వరకు ఉమ్మడి జిల్లాల వారిగా వర్క్‌షాప్స్ నిర్వహిస్తోంది. రైతులు, రైతు సంఘాల నేతల నుంచి అభిప్రాయాలు సేకరిస్తోంది. అందరి అభిప్రాయాలు సేకరించాక... డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నేతృత్వంలోని కేబినెట్ సబ్‌కమిటీ విధివిధానాలపై ఒక నివేదిక తయారుచేసి ప్రభుత్వానికి అందిస్తుంది. ఆ నివేదిక వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో సభ ముందు పెడతారు. సభలోనే రైతు భరోసాపై సీఎం రేవంత్‌రెడ్డి విధివిధానాలు ప్రకటించే అవకాశం ఉంది.

### రుణమాఫీ వారికి నో

ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన హామీలలో ప్రధానమైనది రైతు రుణమాఫీ. ఆ రుణమాఫీకి సంబంధించి ప్రస్తుతం ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోంది. ఈ రుణమాఫీ కోసం దాదాపు 31 వేల కోట్లు అవసరమవుతాయని ప్రభుత్వం అంచనా వేసింది. ఇందులో భాగంగా లబ్ధిదారుల ఎంపిక చేసే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీ నివేదిక ఇవ్వడంతో రుణమాఫీ పథకానికి సంబంధించి ప్రభుత్వం అర్హులను గుర్తించే పనిలో పడింది. నిధుల లభ్యత లేని కారణంగా.. అర్హులకే రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం కార్యాచరణ చేపట్టింది. ఇందులో భాగంగా షాకింగ్ నిర్ణయం తీసుకుంది.మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు రుణమాఫీ వర్తింప చేయకూడదని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ఈ జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులకు మినహాయింపు ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. రుణమాఫీ కోసం అవసరమయ్యే 31 వేల కోట్లకు.. ప్రభుత్వం ఇప్పటికే 10,000 కోట్లను సిద్ధం చేసుకుంది. టీజీ ఐఐసీ భూములను బ్యాంకులకు తనఖా పెట్టి మరో 10 వేల కోట్లను సమీకరించనుంది. రుణాల రూపంలో మరో 10 వేల కోట్లను ఏర్పాటు చేసుకోనుంది. ఒకే దఫాలో రెండు లక్షల పంట రుణాన్ని మాఫీ చేస్తామని ప్రభుత్వం చెబుతోంది. ఆగస్టులోగా ఈ రుణమాఫీ ప్రక్రియను పూర్తి చేస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికే ప్రకటించారు.కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రుణమాఫీ పథకం ప్రధాన కారణమైంది. గత భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం రుణమాఫీ విషయంలో పిల్లి మొగ్గలు వేయడంతో.. అలాంటి పరిస్థితి తలెత్తకూడదని రేవంత్ ప్రభుత్వం కట్టుదిట్టంగా అడుగులు వేస్తోంది. నిధుల లభ్యత లేకపోయినప్పటికీ.. ఉన్న వనరుల ఆధారంగా నిధులను సమీకరించుకుంటున్నది. క్షేత్రస్థాయిలో రైతుల నుంచి ఆగ్రహం వ్యక్తం కాకముందే.. రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధమైంది. అయితే ఈ రైతు రుణాల జాబితాలో ప్రభుత్వ ఉద్యోగులను మొదట మినహాయించాలి అనుకున్నప్పటికీ.. ఆ తర్వాత ప్రభుత్వం ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది. ప్రజా ప్రతినిధులు మినహా, మిగతా వారందరి రుణాలను మాఫీ చేసేందుకే ప్రభుత్వం ముందడుగు వేస్తోంది.

# మెడికల్ కాలేజీలకు అనుమతి నిరాకరణ




**హైదరాబాద్ :** రేవంత్ రెడ్డి సర్కారుకు నేషనల్ మెడికల్ కమిషన్ షాకిచ్చింది. రాష్ట్రంలో ఎనిమిది కొత్త గవర్నమెంట్ మెడికల్ కాలేజీల ఏర్పాటుకు అనుమతి నిరాకరించింది. 2024-25 విద్యాసంవత్సరానికిగానున గద్వాల, మెదక్, ములుగు, షాద్‌నగర్, నారాయణపేట, యాదాద్రి, కుత్బుల్లాపూర్, నర్సంపేటలలో కొత్త మెడికల్ కాలేజీల ఏర్పాటుకు డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ తెలంగాణ దరఖాస్తు చేసుకుంది. ఒక్కో కాలేజీలో 50 సీట్లు కేటాయించాలని కోరింది. అయితే, అవసరమైన నిబంధనలు పాటించడంలో విఫలమయ్యారం టూ అనుమతిచ్చేందుకు ఎన్ఎంసీ నిరాకరించింది. నిబంధనల ప్రకారం.. కొత్తగా 50 ఎంబీబీఎస్ సీట్లతో వైద్య కళాశాల ఏర్పాటు కావాలంటే.. 14 మంది ప్రొఫెసర్లు, 20 మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, 25 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు ఉండాలి. అంటే మొత్తంగా 59 మంది బోధన సిబ్బంది తప్పనిసరిగా ఉండాలి. అయితే ఈ కొత్త 8 కాలేజీల్లో ప్రిన్సిపాళ్లు, హాస్పిటల్ సూపరింటెండెంట్లు తప్ప మిగతా సిబ్బంది నియామకం జరగలేదు. ఇటీవల ఎన్ఎంసీ బృందం తనిఖీలకు వచ్చింది. ఈ సందర్భంగా అసలు ఫ్యాకల్టీ లేకపోవడంపై ఎంఏఆర్బీ( తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలుస్తోంది. ఆయా కళాశాలల్లో ఉన్న లోపాలను ఎత్తిచూపుతూ.. ప్రిన్సిపాళ్లకు మెయిల్ ద్వారా సమాచారం ఇచ్చారు. అలాగే కొత్త మెడికల్ కాలేజీల అనుబంధ ఆస్పత్రుల్లో అవుట్ పేషంట్స్, ఇన్‌పేషంట్స్‌పై కూడా ఎన్ఎంసీ అసంతృప్తి వ్యక్తం చేసింది.ఎన్ఎంసీ లేవనెత్తిన లోపాలను వైద్యారోగ్యశాఖ 60 రోజుల్లోగా సవరించుకోవాల్సి ఉంటుంది. లేకపోతే అనుమతులు మంజూరుచేయరు. అయితే ఈ లోగా కొత్త కాలేజీలకు సంబంధించి నియామక ప్రక్రియ పూర్తికావటం అనేది అనుమానమే. ఇటీవల అసోసియేట్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు పొందినవారిని కేటాయించినా.. ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, సీనియర్ రెసిడెంట్ల నియామక ప్రక్రియ ఎప్పుడు ప్రారంభం అవుతుందో, ఎపుడు ముగుస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచే కొత్త మెడికల్ కాలేజీలకు అనుమతులపై శ్రద్ధ పెట్టి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదు. సిబ్బంది నియామకాలకు సంబంధించి ఆయా కళాశాలల ప్రిన్సిపాల్స్ మొదటి నుంచీ వైద్యారోగ్యశాఖకు గుర్తు చేస్తున్నా పట్టించుకోలేదు.మెడికల్ కాలేజీల అననుమతి అంశాన్ని పునఃపరిశీలించాలని ఎన్ఎంసీని కోరాలని డీఎంఈ నిర్ణయించింది. మరోసారి దరఖాస్తు చేసేందుకూ కసరత్తు చేస్తోంది. కొత్త మెడికల్ కాలేజీల ప్రారంభం నుంచే అన్ని విభాగాలు, అనుబంధ బోధనాసుపత్రి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని ఎన్ఎంసీ నిబంధనలు స్పష్టంగా చెబుతున్నాయి. ఈ విషయమై డీఎంఈ ఉన్నతాధికారులు మాట్లాడుతూ.... షాద్‌నగర్, కుత్బుల్లాపూర్ మినహా మిగిలిన ఆరింటికి అనుమతులు వస్తాయని భావించాం. భవనాల సమస్య లేకున్నా కొన్నిచోట్ల అనుబంధ ఆసుపత్రులు, సిబ్బందిపై ఎన్ఎంసీ అసంతృప్తి వ్యక్తంచేసింది. బోధనా సిబ్బందిని సర్దుబాటు చేసే ప్రక్రియ కొనసాగుతుండగానే నిర్ణయం వెలువడింది. ఇప్పటికే ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్ల పదోన్నతులు ఇచ్చాం. తాజా బదిలీల్లోనూ కొత్త వైద్య కళాశాలల్లోని పోస్టులకు ప్రాధాన్యం ఇవ్వనున్నాం. తనిఖీల సమయంలో లేని సదుపాయాలను తర్వాత సమకూర్చాం. అందుకే నిర్ణయాన్ని పునఃపరిశీలించాలని ఎన్ఎంసీని కోరుతామని డీఎంఈ అధికారులు అంటున్నారు. 8 కాలేజీల్లో కనీసం కొన్నింటినైనా ఈ ఏడాది ప్రారంభించాలనే ఆలోచనతో ఉన్నట్లు డీఎంఈ తెలిపింది. ఈ నెలాఖరు నాటికి మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు అవకాశముందని.. అన్ని అంశాలపై వైద్యారోగ్య శాఖ మంత్రితో చర్చించి నిర్ణయం తీసుకుంటామని అధికారులు వివరించారు.

## రాష్ట్రవ్యాప్తంగా నిలిచిపోయిన రిజిస్ట్రేషన్లు

-మొదటిపేజీ తరువాయి

చేసుకున్న రిజిస్ట్రేషన్లు శుక్రవారం పూర్తి చేస్తామని అధికార వర్గాలు తెలిపాయి. రాష్ట్రవ్యాప్తంగా 140 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. వాస్తవానికి ప్రతిరోజూ రాష్ట్రవ్యాప్తంగా 5వేల నుంచి 7వేల రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. దీంతో రూ.60కోట్ల నుంచి రూ.70కోట్ల వరకు ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది. గతంలో ఇదే తరహాలో సాంకేతిక సమస్య తలెత్తిన విషయం తెలిసిందే.

## కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి హైదరాబాద్‌కి ఏం తెచ్చాడు



**హైదరాబాద్:** హైదరాబాద్ ఈమేజ్‌ని డ్యామేజ్ చేసేలా కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతున్నారని మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కిషన్ రెడ్డి మాటలను ఖండిస్తున్నానని అన్నారు. హైదరాబాద్‌కి ఆయన ఏం తెచ్చారని ప్రశ్నించారు. ఈరోజు(గురువారం) మంత్రి పొన్నం ప్రభాకర్ గాంధీభవన్‌లో మీడియాతో మాట్లాడుతూ... హైదరాబాద్ నగరాన్ని బీజేపీ, బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేశాయని ధ్వజమెత్తారు. తెలంగాణకు నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరామని గుర్తు చేశారు. కిషన్ రెడ్డి కేంద్రమంత్రి కాగానే హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రిగా కలిశానని తెలిపారు. మాజీ మంత్రి కేటీఆర్ కేంద్రంపై ఒత్తిడి తేలేకపోయారని.. ఆయన పెద్ద అసమర్థుడని విమర్శలు చేశాడు. హైదరాబాద్ అస్తవ్యస్తం కావడానికి కేటీఆర్‌నే కారణమని ధ్వజమెత్తారు. ఉద్యోగ క్యాలెండర్ తప్పకుండా ఇస్తామని హామీ ఇచ్చారు. ఉద్యోగ నియామకాలు జాప్యం అవుతున్నాయని మొన్నటి వరకు ప్రశ్నించి, ఇప్పుడు పరీక్షలు వాయిదా వేయాలని అనడం భావ్యం కాదని చెప్పారు. రాజకీయ నాయకుల ఉచ్చులో విద్యార్థులు పడొద్దని సూచించారు. విద్యార్థుల న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరిస్తామని మాటిచ్చారు. మాజీ సీఎం కేసీఆర్, మంత్రులు వినియోగించిన భాషను తాము వాడమని అన్నారు. తాము వాడాలనుకుంటే నాటు భాష మాట్లాడగలమని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రజాప్రతినిధుల్లో చదువుకున్న వాళ్లు, పోస్ట్ గ్రాడ్యుయేట్లు, డాక్టర్లు ఉన్నారని.. తాము విజ్ఞతతో ఉంటున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## అభిప్రాయాలు తెలుసుకోవడానికే

## రైతు భరోసాపై సదస్సులు: భట్టివిక్రమార్క

**ఉట్నూరు రైతు భరోసా వర్క్ షాప్‌లో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి**

**రైతు భరోసా పథకం విధివిధానాలపై అభిప్రాయాలు సేకరిస్తున్నట్లు వెల్లడి**

**అన్నదాతల అభిప్రాయాల మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందన్న భట్టివిక్రమార్క**

రైతు భరోసాపై అందరి అభిప్రాయాలు తెలుసుకోవడానికే సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలంగాణ ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఈరోజు ఆదిలాబాద్ జిల్లా ఉట్నూరులో రైతు భరోసా వర్క్ షాప్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... మంత్రివర్గ ఉపసంఘం ఆధ్వర్యంలో రైతు భరోసా పథకం విధివిధానాలపై రాష్ట్రవ్యాప్తంగా ఆయా ప్రాంతాల్లో అభిప్రాయ సేకరణ చేపడుతున్నట్లు తెలిపారు. అన్నదాతల అభిప్రాయాల మేరకే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని స్పష్టం చేశారు. రైతు భరోసా వర్క్ షాప్ కార్యక్రమంలో మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తుమ్మల మాట్లాడుతూ... తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత - చేవెళ్ల ప్రాజెక్టు నిర్మాణానికి యోచిస్తున్నట్లు చెప్పారు. చిన్న రైతుల కోసం పథకాల రూపకల్పనకు ప్రభుత్వం ఆలోచిస్తోందన్నారు. ప్రజలతో చర్చించి పథకాలు అమలు చేయడమే తమ లక్ష్యమని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ప్రజల నుంచి సేకరించిన అభిప్రాయాలపై అసెంబ్లీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామన్నారు.

## 24 నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు!

-మొదటిపేజీ తరువాయి

గత కొద్ది రోజుల నుంచి ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క ఆయా శాఖల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తున్నారు. ఎక్సైజ్ శాఖ ఆర్థికాంశాల గురించి మంత్రి జూపల్లికృష్ణారావు గురువారం సమీక్షించారు. ఉదయం 11 గంటలకు సమీక్ష ప్రారంభం కాగా, సాయంత్రం వరకు కొనసాగింది. ఈ నెల 24వ తేదీ నుంచి తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. కానీ ఎన్ని రోజులు జరుగుతాయనే విషయంపై స్పష్టత రాలేదు. ఈ సమావేశాల్లో పూర్తి స్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు. అలాగే.. ముఖ్యమైన రైతు భరోసా పథకంపైనా కీలకమైన చర్చ జరిగే అవకాశం ఉన్నది. అసెంబ్లీలో చర్చించిన తర్వాత విధివిధానాలపై నిర్ణయానికి వస్తామని ఇది వరకే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడించారు. అలాగే, జాబ్ క్యాలెండర్‌ను కూడా రాష్ట్ర ప్రభుత్వం సమావేశాల్లో ప్రకటించే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయవర్గాలు తెలిపాయి.

## రాజ్యసభ సీటు కోసం వీహెచ్ ప్రయత్నాలు



**హైదరాబాద్ :** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో పదుల లొల్లి అంతకంతకూ పెరుగుతూనే ఉంది. మంత్రి పదవులు, పీసీసీ చీఫ్ స్థానాలను ఇప్పటి వరకూ భర్తీ చేయలేకపోయారు. తాజాగా కాంగ్రెస్ లో చేరిన కేకే రాజీనామాతో ఖాళీ అయిన రాజ్యసభ స్థానం కోసం రేస్ ప్రారంభమయింది. ఆ స్థానం తనకే ఇవ్వాలని సీనియర్ నేత వీ హనుమంతరావు డిమాండ్ చేశారు. గాంధీ భవన్‌లో ప్రెస్ మీట్ పెట్టిన ఆయన.. లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ ఎంపీ టికెట్ తనకు ఇస్తే గెలిచేవాడినని కానీ తనకు టిక్కెట్ విషయంలో అన్యాయం చేశారన్నారు.ఎనిమిదేళ్లుగా తనకు ఎలాంటి పదవీ లేదని ఆయినా పార్టీ విజయానికి కృషి చేసానని తెలిపారు. త్వరలో రాజ్యసభకు జరగనున్న ఉపఎన్నికల్లో తనకు అవకాశం కల్పించాలని పార్టీ హైకమాండ్ కు విజ్ఞప్తి చేసారు. కేకే రాజీనామా చేయడం వల్ల ఒక్క రాజ్యసభ స్థానం ఖాళీ అయింది. ఇప్పుడు ఉపఎన్నికలు నిర్వహిస్తే ఆ స్థానాన్ని కాంగ్రెస్ పార్టీ గెలుచుకుంటుంది. అందుకే వీ హనుమంతరావు ముందుస్తుగానే గాంధీభవన్ లోనే ప్రెస్ మీట్ పెట్టి తన కోరికను వ్యక్తం చేశారు. అయితే తన రాజ్యసభ స్థానాన్ని మళ్లీ తనకు ఇచ్చే షరతుల మీదనే కేకే పార్టీ మారారాన్న ప్రచారం ఉంది. ఈ విషయంపై కాంగ్రెస్ వర్గాలు ధృవీకరించడం లేదు . కానీ పార్టీ మారగానే కేకే రాజీనామా చేయాల్సిన అవసరం లేదని ఇంకా చెప్పాలంటే..ఆయన పార్టీలో చేరాల్సిన అవసరం కూడా లేదని అంటున్నారు. పార్టీ మారకుండానే పార్టీ నేతగా చెలామణి కావొచ్చు.. ఆయన కుమార్తె హైదరాబాద్ మేయర్ ఇప్పటికే పార్టీ మారిపోయారు. కానీ విలువలు కాపాడినట్లుగా ఉంటుందని అలాగే.. తన రాజ్యసభ సీటు తనకు వస్తుందన్న నమ్మకంతోనే కేకే రాజీనామా చేసినట్లుగా తెలుస్తోంది. కేకే అలా రాజీనామా చేయగానే ఇలా సీఎం రేవంత్ రెడ్డి ఆయనకు సలహాదారు పదవి ఇచ్చారు. కేబినెట్ హోదా కూడా ఇచ్చారు. ఈ కారణంతో ఆయన కాళీ చేసిన రాజ్యసభ సీటు ఆయనకు ఇవ్వకపోవచ్చన్న ప్రచారం జరుగుతోంది. ఈ క్రమంలో వీ హనుమంతరావు తన ప్రయత్నం తాను చేసుకోవడానికి తెర ముందుకు వచ్చినట్లుగా చెబుతున్నారు. ఒకప్పుడు ఏఐసిసిలో ప్రముఖ నేతగా ఉన్న వీహెచ్ ఇప్పుడు ప్రాధాన్యం కోల్పోయారు. సీనియర్ నేతగా ఆయనకు గుర్తింపు ఇస్తున్నా.. పదవుల గురించి మాత్రం ఆయన పేరును పరిగణనలోకి తీసుకోవడం లేదు

# పేదలను 'సమాధి' చేస్తున్న అక్రమ అవయవ వ్యాపారం

ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న అక్రమ అవయవ వ్యాపారం ధనవంతుల జీవన ప్రమాణాలను పెంచుతుండగా.. మధ్య వర్తులకు లాభాలపంటను పండిస్తున్నది. అదే సమయంలో పేదలను మాత్రం 'సమాధి' చేస్తున్నది. ఇటీవల ఢిల్లీ, విజయవాడలో వెలుగుచూసిన ఘటనలు ఇందుకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. సోషల్ మీడియా ద్వారానూ ఈ ఆర్గాన్ రాకెట్ యథేచ్ఛగా కొనసాగుతుండడం ఆందోళనకు గురి చేస్తున్నది.

**ఇండియాలో విదేశీయుల ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంటేషన్**

హ్యూమన్ ఆర్గాన్ ట్రాన్స్ ప్లాంట్ రాకెట్ ను ఇటీవల ఢిల్లీ పోలీసులు ఛేదించారు. ఒక మహిళా డాక్టర్ సహా ఏడుగురిని అరెస్టు చేశారు. ఇందులో దాతలు, గ్రహీతలతోపాటు కీలక సూత్రధారి బంగ్లాదేశ్ కు చెందిన వారిగా గుర్తించారు. 2019 నుంచి ఈ ఆర్గాన్ రాకెట్ కొనసాగుతున్నదని నిర్ధారించారు. ఒక్కొక్కరి నుంచి రూ. 25 నుంచి రూ. 30 లక్షలు వసూలు చేస్తున్నారని భావిస్తున్నారు. బంగ్లాదేశ్‌కు చెందిన ఈ రాకెట్ ఢిల్లీలోని ఒక మహిళా డాక్టర్ సహాయంతో నోయిడాలోని ఆస్పత్రిలో 15 నుండి 16 కిడ్నీలు మార్పిడి చేసినట్లు గుర్తించారు. ఉద్యోగాల పేరుతో ఇక్కడికి తీసుకొచ్చి, నకిలీ డాక్యుమెంట్లు సృష్టించి, బంధువుల పేరుతో ప్రవేశపెట్టి కిడ్నీ మార్పిళ్లు చేస్తున్నట్లు నిర్ధారించారు.

**భారతీయులను విదేశాల్లోకి తీసుకెళ్లి..**

ఇండియాలో వెలుగుచూసిన పలు ఆర్గాన్స్ రాకెట్స్ లో అంతర్జాతీయంగా వ్యాపారం కొనసాగుతున్నట్లు తేలింది. 2024 మేలో వెలుగు చూసిన హైదరాబాద్ వయా కొచ్చి టూ ఇరాన్ కేంద్రంగా నడిచిన ఓ కిడ్నీ రాకెట్ గతంలో భారతదేశంలో సంచలనం సృష్టించింది. ఓ యువకుడు అనారోగ్యంతో మృతి చెందగా, కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టి కిడ్నీ రాకెట్ ముఠా గుట్టురట్టు చేశారు. ఈ ముఠా పేద యువకులను లక్ష్యంగా చేసుకుని ఒక్కో కిడ్నీకి రూ.20 లక్షలు ఇస్తామని ఆశజూపి.. ఇరాన్‌కు తీసుకెళ్తున్నట్లు గుర్తించారు. అక్కడ కిడ్నీలు తీసుకుని.. తిరిగి ఇండియాకు తీసుకొస్తున్నట్లు నిర్ధారించారు. హైదరాబాద్, కేరళకు చెందిన 40 మంది యువకులను ఇలా ఇరాన్ కు తీసుకువెళ్లి కిడ్నీ మార్పిడి చేయించినట్లు పోలీసులు గుర్తించారు. శ్రీలంక, ఈజిప్ట్, టర్కీలకు సైతం తీసుకెళ్లి కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు చేయిస్తున్నట్లు కొన్ని కేసుల్లో నిర్ధారించారు.



**పేదరికాన్ని ఆసరాగా చేసుకొని..**

పేదల ఆర్థిక అవసరాలే అవయవాల అక్రమ వ్యాపారానికి పెట్టుబడిగా మారుతున్నాయి. గుంటూరుకు చెందిన ఆట్రో డ్రైవర్ ఆర్థిక పరిస్థితి, అతడి అప్పులను ఆసరాగా చేసుకొని కిడ్నీ తీసుకున్న ఘటన ఇటీవల విజయవాడలో కలకలం రేపింది. అయితే రూ. 30 లక్షలకు ఒప్పందం కుదుర్చుకొని రూ. 1.10 లక్షలు మాత్రమే చెల్లించడంతో బాధితుడి ఫిర్యాదు మేరకు ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఘటనపై ఏపీ ప్రభుత్వం సీరియస్ అయి విచారణకు ఆదేశించింది. గతంలో విశాఖపట్నంలో కూడా ఇలాంటి ఘటనలు వెలుగుచూశాయి. విశాఖపట్నంలో చట్టవిరుద్ధంగా 10 శాతం మేర కిడ్నీ మార్పిడి ఆపరేషన్లు జరుగుతున్నాయని గతంలో నగర పోలీసు కమిషనర్ కూడా చెప్పడం గమనార్హం.

**సోషల్ మీడియా ద్వారా..**

సోషల్ మీడియా ద్వారానూ అక్రమ అవయవ వ్యాపారం కొనసాగుతున్నట్లు అర్థమవుతున్నది. ఇటీవల విజయవాడలో వెలుగు చూసిన కిడ్నీ ట్రాన్స్ ప్లాంటేషన్ వ్యవహారం కూడా సోషల్ మీడియా పరిచయాల ద్వారానే జరిగినట్లు తెలుస్తున్నది. గుంటూరుకు చెందిన గార్లపాటి మధుబాబుకు సోషల్ మీడియా ద్వారా పరిచయమైన బాషా కిడ్నీ అమ్మి డబ్బులు సంపాదించుకోవచ్చని సలహా ఇవ్వడంతోనే మధుబాబు దానికి ఒప్పుకున్నట్లు తెలుస్తున్నది. మరోవైపు మానవ అవయవాలను విక్రయించేందుకు ఓ ప్రముఖ ఆస్పత్రి వెబ్ సైట్ ను పోలి ఉన్న ఓ నకిలీ వెబ్‌సైట్‌ను రూపొందించినట్లు 2023లో గుర్తించారు. ఈ ఘటనలో ఇద్దరు ఆఫ్రికన్ పౌరులతో సహా ఐదుగురిని చెన్నై పోలీసులు బెంగళూరులో అరెస్టు చేశారు. ఓ ముఠా ఈ నకిలీ వెబ్‌సైట్‌ను నడుపుతున్నట్లు కేసు దర్యాప్తులో తేలింది. ఊపిరితిత్తులు, కిడ్నీలు వంటి మానవ అవయవాలను మార్పిడి చేయడానికి ఈ ముఠా రూ.5 కోట్ల వరకు ధర చెబుతున్నట్లు పోలీసులు తెలిపారు. అవయవదానం పేరుతో ఫేస్ బుక్ అడ్డాగా దందా సాగిస్తున్న గ్యాంగ్ ను గతంలో రాచకొండ పోలీసులు అరెస్ట్ చేశారు.

**కిడ్నీలకు ఫుల్ డిమాండ్..**

అవయవాల మార్పిడిలో కిడ్నీలకు ఫుల్ డిమాండ్ ఉంటున్నది. జీవన్ దాన్ వెబ్ సైట్స్ లో వంద మంది అవయవదానం కోసం ఎదురు చూస్తుంటే వాటిలో కిడ్నీల కోసం ఎదురు చూస్తున్నవారే 70 మంది వరకు ఉంటారు. కిడ్నీ మార్పిడి అవసరమైన వాళ్లు దేశంలో ఏటా సుమారు 1.5 లక్షల నుంచి 2 లక్షల మంది పెరుగుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా సుమారు 8 లక్షల నుంచి 9 లక్షల మంది వరకు కిడ్నీ మార్పిడి కోసం ఎదురు చూస్తున్నారు.

**కఠిన శిక్షలున్నా..**

ఎవరికైనా బ్రెయిన్ డెడ్ అయితే వారి బంధువుల అనుమతితో అవయవదానం చేయవచ్చు. అలాగే రక్త సంబంధీకులు వారి కుటుంబ సభ్యులకు అవయవదానం చేయవచ్చు. రెండు కిడ్నీలు, రెండు కళ్లు, రెండు ఊపిరితిత్తులు, కాలేయం, గుండె ఇలా ఒక మనిషి అవయవదానం చేస్తే ఎనిమిది మందికి ప్రాణం పోయవచ్చు. అయితే అవయవదానం చేయాలంటే ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంటుంది. అలా చేయకుండా ఎవరైనా అవయవదానం చేస్తే అది నేరం. వారికి ఐదు నుంచి పది సంవత్సరాల వరకు కఠిన కారాగార శిక్ష పడుతుంది. అవయవ మార్పిడి చట్టం-1994 ప్రకారం నిబంధనలు ఉల్లంఘించి ఆపరేషన్ చేసిన డాక్టర్ల రిజిస్ట్రేషన్, ఆపరేషన్ జరిగిన ఆస్పత్రి రిజిస్ట్రేషన్ రద్దు చేస్తారు. అవయవదాన చట్టంలో 2023లో కేంద్రం కొన్ని మార్పులు చేసింది. నోటో (నేషనల్ ఆర్గాన్ అండ్ టిష్యూ ట్రాన్స్ ప్లాంట్ ఆర్గనైజేషన్)లో ఇందుకు సంబంధించిన మార్గదర్శకాలను అందుబాటులో ఉంచింది.

**– ఖిజర్ పాషా, సామాజిక కార్యకర్త,**
**8008710143**

# సస్పెన్షన్లు సరే.. శిక్షలు పడతాయా!?

రాష్ట్రంలో అధికార మార్పిడి జరిగిన తర్వాత ఏసీబీ దాడులు పెరిగిపోయాయి. ఆరు నెలల్లో 70 మందికి పైగా లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డారు. మరికొందరిపై ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు నమోదు చేశారు. ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో దాడులు చేస్తున్నారు. సాక్ష్యాధారాల కోసం వీడియోలు రికార్డు చేస్తున్నారు. అరెస్టులతో సరిపెట్టకుండా వారి ఆస్తులు, బినామీల వివరాలు ఆరా తీస్తున్నారు. అక్రమంగా సంపాదించిన డబ్బులు, బంగారం, భూములు, స్థిర చరాస్తులను లెక్కగడుతున్నారు. ఏసీబీ కేసు నమోదు కాగానే సంబంధిత శాఖలు వారిని సస్పెండ్ చేస్తున్నాయి. అయితే ఏసీబీ కేసుల చరిత్రను పరిశీలిస్తే... అవినీతి నిరోధక శాఖకు పట్టుబడిన వారిలో కొందరికి మాత్రమే శిక్షలు పడుతుండగా.. మరికొందరు ఎలాంటి చర్యలు లేకుండా మళ్లీ ఉద్యోగంలో చేరుతున్నట్లు తెలుస్తున్నది. మరికొందరిపై విచారణకు అసలు ప్రభుత్వం అనుమతి కూడా ఇవ్వడం లేదు. దీంతో లంచాలు తీసుకుంటూ పట్టుబడ్డ వారిపై కచ్చితంగా చర్యలు తీసుకునేలా ప్రభుత్వం, ఏసీబీ వ్యవహరించాలనే డిమాండ్ వినిపిస్తున్నది.

**రెండు రకాల కేసులు..**

సాధారణంగా ఏసీబీ అధికారులు రెండు రకాల కేసులు నమోదు చేస్తారు. ఇందులో మొదటిది.. లంచం అడుగుతున్నారని ఎవరైనా ఫిర్యాదు చేస్తే.. సంబంధిత ఉద్యోగులను లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుకోవడం. దీన్ని ట్రాప్ కేసు అని పిలుస్తారు. రెండోది ఆదాయానికి మించిన ఆస్తుల కేసు. అవినీతి చేసి ఆస్తులు సంపాదించినట్టు కంప్లయింట్ వస్తే మొదట వివరాలు సేకరించి.. ఆ తర్వాత వారి ఇండ్లు, బంధువులు, బినామీల ఇండ్లపై ఒకేసారి దాడులు చేశారు. డబ్బు, పత్రాలు, బంగారం అన్నీ స్వాధీనం చేసుకుంటారు. ఆ తర్వాత వారి జీతం, ఇతర అధికారిక ఆదాయాలూ అన్నీ లెక్కవేసి, అంతకంటే ఎక్కువ ఉంటే అది ఎలా వచ్చిందో విచారణ జరుపుతారు. సరైన కారణాలు చెప్పకుంటే ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టారని కేసు పెడతారు.

**కొంతకాలంగా తగ్గిన ఏసీబీ ట్రాప్స్..**

రెండేండ్ల క్రితం వరకు ఏసీబీ ట్రాప్ కేసుల సంఖ్య క్రమంగా తగ్గుతున్నట్లు తెలుస్తున్నది. 2016లో ఏసీబీ 89 ట్రాప్ కేసులు నమోదు చేస్తే.. 2017లో 65 ట్రాప్ లు నమోదు చేసింది. 2018లో 152, ఇంకా 2019లో 168 ట్రాప్ కేసులు పెట్టింది. ఆ తర్వాత ట్రాప్ కేసుల సంఖ్య బాగా తగ్గింది. 2020లో 65, ఇంకా 2021లో 68 ట్రాప్ కేసులు మాత్రమే నమోదయ్యాయి. మరోవైపు పూర్తిస్థాయి వివరాలు అందించడానికి ఏసీబీ అధికారులు నిరాకరిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తున్నది.

**శిక్షలు పడుతున్నది కొందరికేనా.!**

లంచం తీసుకుంటూ లేదా ఆదాయానికి మించి ఆస్తుల వ్యవహారంలో ఏసీబీకి పట్టుబడుతున్న వారిలో చాలా మందికి శిక్షలు పడడం లేదనే చర్చ జరుగుతున్నది. సగం



మందిపైనే నేర నిరూపణ జరుగుతున్నట్లు గణాంకాల ద్వారా స్పష్టమవుతున్నది. అప్పటికప్పుడు శాఖాపరంగా సస్పెన్షన్ కు గురైనా.. ఆ తర్వాత ఏడాదికో, రెండేళ్లకో ఎలాగోలా విధుల్లో చేరుతున్నట్లు తెలుస్తున్నది. ఆంధ్రప్రదేశ్ లో ప్రతి వంద మందిలో 52 మందిపై కేసులు రుజువు అవుతుండగా.. తెలంగాణలో వందలో 63 మంది కేసులు రుజువు అవుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. ఇదిలా ఉంటే ట్రాప్ కేసుల్లో 65 శాతం శిక్షలు పడుతుంటే.. ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో 12 శాతం కూడా శిక్షలు పడనట్లు తెలుస్తున్నది. రెండు తెలుగు రాష్ట్రాల్లో కలిపి సుమారు రెండు వేలకు పైగా ఏసీబీ కేసులు పెండింగ్ లో ఇంకా పెండింగులోనే ఉండడం గమనార్హం. ఏసీబీ కేసుల్లో చిన్నస్థాయి ఉద్యోగులకే శిక్షలు పడుతున్నాయని, వారిపైనే చర్యలు తీసుకుంటున్నారనే అభిప్రాయాలున్నాయి. ప్రభుత్వ అధికారులపై ప్రాసిక్యూషన్ జరపాలంటే సర్కారు అనుమతి కావాలన్న నిబంధన కొందరికి వరంగా మారుతున్నదని, ఏసీబీకి పట్టుబడినవారు తమ పలుకుబడిని ఉపయోగించి, రాజకీయ నేతల ద్వారా ఒత్తిళ్లు చేయించి ఉన్నతాధికారులు ప్రాసిక్యూషన్కు అనుమతివ్వకుండా చూసుకుంటున్నారనే చర్చ సైతం ఉన్నది. దీనివల్ల కేసులు ఏండ్ల తరబడి పెండింగ్లో పడిపోతున్నాయి. కొన్ని కేసులైతే కోర్టు విచారణకు వెళ్లకుండానే మూసివేస్తున్నారనే ఆరోపణలు సైతం ఉన్నాయి. గత కొన్ని సంవత్సరాల్లో ఒక్క రెవెన్యూ శాఖలోనే 50కి పైగా ఏసీబీ కేసులను మూసివేశారనే చర్చ ఉన్నది.

**విచారణ ఆలస్యమవుతుండడంతో..**

నిబంధనల ప్రకారం ఏసీబీ నివేదికపై ట్రాప్ కేసులో పట్టుబడ్డ వారిపై మూడు నెలల్లో, ఆదాయానికి మించిన ఆస్తుల కేసుల్లో ఆరు నెలల్లో ప్రభుత్వం విచారణ జరిపి చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ చాలా సందర్భాల్లో నెలల తరబడి విచారణ సాగుతుండడంతో చాలా మంది తప్పించుకుంటున్నారనే చర్చ ఉన్నది. ఏడాదికి పైగా విచారణ కొనసాగితే కేసు వీగిపోయే అవకాశాలే ఎక్కువగా ఉంటాయని నిపుణులు చెబుతున్నారు. సాక్ష్యాలు తారుమారు కావడం, సాక్ష్యులు ఎటో వెళ్లిపోవడం, బాధితులు, నిందితుల మధ్య ఒప్పందాలు కుదరడం, ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి విచారణను ప్రభావితం చేయగలగడం.. ఇలా అనేక కారణాలతో కేసులు నీరుగారిపోతాయని పేర్కొంటున్నారు. మరోవైపు లంచం తీసుకుంటూ రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడి ఏసీబీ కేసులున్నా.. అవి తేలకుండానే కొందరు మళ్లీ విధుల్లో చేరుతున్నట్లు తెలుస్తున్నది. కోర్టుల్లో కేసులు నడుస్తున్నా.. సర్వీసు నిబంధనల వంకతో ఏసీబీ ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగులు తిరిగి విధుల్లో చేరిపోతుండడం విమర్శలకు తావిస్తున్నది.

**ఈ శాఖల్లోనే ఎక్కువ...**

ఏసీబీ దాడులను పరిశీలిస్తే.. కొన్ని శాఖల్లో అవినీతి పేరుకుపోయినట్లు స్పష్టంగా తెలుస్తున్నది. అవినీతి కేసుల్లో ఎక్కువగా రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది పట్టుబడుతుండగా మున్సిపల్ శాఖ రెండో స్థానంలో ఉంది. పోలీస్, పంచాయతీరాజ్ ఉద్యోగులూ ఏసీబీకి చిక్కుతున్నారు. అంతేకాకుండా దేవాదాయ, కమర్షియల్ ట్యాక్స్, వ్యవసాయ శాఖ అధికారులు కూడా అధిక సంఖ్యలోనే ఏసీబీకి పట్టుబడుతున్నారు. 2017లో ఏసీబీ 65 కేసులు పెట్టగా అందులో 17 రెవెన్యూ శాఖకు చెందినవే. 2018లో 147 ఏసీబీ కేసులు నమోదైతే 34 కేసుల్లో పట్టుబడ్డవారు రెవెన్యూ ఉద్యోగులే కావడం గమనార్హం. ప్రతి ఏటా రెవెన్యూ ఉద్యోగుల సంఖ్యనే ఎక్కువగా ఉంటుండడం విశేషం. 2019లో 173 కేసులు నమోదైతే ఇందులో 54 మంది రెవెన్యూ శాఖకు చెందిన వారు ఉండగా, 25 మంది మున్సిపల్, 18 మంది పోలీస్ డిపార్ట్ మెంట్ కు చెందిన ఉద్యోగులు ఉన్నారు.

**ఇలా చేస్తేనే ప్రయోజనం..**

తెలంగాణ అవినీతి నిరోధక శాఖ హెల్ప్ లైన్ నంబర్ 1064 సేవలు ప్రస్తుతం 24 గంటలు అందుబాటులో ఉంటున్నాయి. లంచం కోసం అధికారులు వేధిస్తే.. ఈ నంబర్ కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చు. అదే సమయంలో ప్రభుత్వ ఉద్యోగులు ఏటేటా తమ ఆస్తిపాస్తులను రిటర్న్ రూపంలో చూపించాల్సి ఉండగా.. అది జరగడం లేదు. దీన్ని కచ్చితంగా పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. అవినీతికి పాల్పడే అధికారులను శాశ్వతంగా ఉద్యోగం నుండి తీసివేసే చట్టం తీసుకురావాలనే డిమాండ్ సైతం ఉన్నది.

**–ఫిరోజ్ ఖాన్, సీనియర్ ఫ్రీలాన్స్ జర్నలిస్ట్,**

## మానాల మోహన్ రెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ నాయకులు



**వాస్తవ నేస్తం,ఏర్గట్ల :** తెలంగాణ సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ గా పదవి బాధ్యతలు స్వీకరించిన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డిని గురువారం నాగేంద్ర నగర్ గ్రామ కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్ లోని తన కార్యాలయంలో కలిసి పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంసన్, హరీష్, రహీం, జమాల్, సలీం, రాజు, దాము, తదితరులు ఉన్నారు.

## టిజిఐఐసి చైర్మన్ నిర్మల జగ్గా రెడ్డిని కలిసిన నీలం మధు



**వాస్తవ నేస్తం,పటాన్చెరువు:** టిజిఐఐసి చైర్మన్ గా భాధ్యతలు స్వీకరించిన నిర్మల జగ్గా రెడ్డిని నీలం మధు హైదరాబాద్ బషీర్ బాగ్ లోని వారి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పూల బొకే ఇచ్చి ఘనంగా సత్కరించారు. అనంతరం నీలం మధు మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంగా అభివృద్ధి చెందిన సంగారెడ్డి జిల్లాకు టిజిఐఐసి చైర్మన్ పదవి దక్కడం సంతోషంగా ఉందన్నారు. టీజిఐఐఏసీ చైర్మన్ గా నియమితులైన సంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు నిర్మల జగ్గారెడ్డి సహకారంతో పారిశ్రామికంగా మరింత అభివృద్ధి సాధించడం ఖాయమని విశ్వాసం వ్యక్తం చేశారు.

## పరిశ్రమ యజమాన్యం పై చర్యలు తీసుకుంటాం



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** జిన్నారం మండలం మంగంపేట గ్రామంలోని 55 సర్వేనెంబర్ లో గల మంగంపేట గ్రామం నుండి ఉట్ల గ్రామం వరకు గల లింకు రోడ్డును హిటాచి పెట్టి రోడ్డును ధ్వంసం చేస్తుండడంతో సమాచారం తెలుసుకున్న గ్రామ ప్రజలు అక్కడికి వచ్చి ధ్వంసం చేసిన రోడ్డును మళ్లీ అదే హిటాచి తో మరమ్మత్తు చేపించారు. గ్రామస్తులు ఇట్టి విషయం ఎంపీఓ తెలపగా వారు వెంటనే వచ్చి రోడ్డును పరిశీలించి ఇట్టి విషయంపై పరిశ్రమ యజమాన్యంపై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

## బీజేపీ ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష



**వాస్తవ నేస్తం,పటాన్చెరు:** సంగారెడ్డి పట్టణంలో కొత్త బస్టాండ్ నటరాజ్ థియేటర్ వద్ద భారతీయ జనతా పార్టీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో రైతు సత్యాగ్రహ దీక్ష నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు శ్రీమతి గోదావరి అంజిరెడ్డి విచ్చేసి వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను మోసం చేసిందని ఆరు గ్యారెంటీలను అమలు చేయకపోగా రైతులకు ఇస్తానన్న రెండు లక్షల రుణమాఫీని కమిటీల పేరుతో కాలయాపన చేస్తూ రైతులను మోసం చేస్తున్నారన్నారు రాష్ట్రంలో రైతుల ఆత్మహత్యలు కొనసాగుతున్న రాష్ట్ర ప్రభుత్వం చూస్తూ రైతులను ముంచేస్తున్నారని రైతులకు వెంటనే రెండు లక్షల రుణమాఫీని బేషరతుగా ఇవ్వాలని లేని పక్షంలో రానున్న రోజులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని మరియు సంగారెడ్డి జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షులు మల్లేపల్లి రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ రైతులందరూ బ్యాంకుల ముందు రుణమాఫీ కోసం పంట పెట్టుబడి కోసం రుణాల కోసం అసిగిపోతున్నారని వెంటనే రుణాలను మాఫీచేసి రైతు లకు కొత్త రుణాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ప్రతాప్ రెడ్డి, కృష్ణా రెడ్డి, రాజిరెడ్డి,శివకుమార్, చల్లా ప్రభాకర్ రెడ్డి, మందుల నాగరాజ్, కసిని వాసు, రాజు గౌడ్, విజయ్ కుమార్, పుల్లంగరి సురేందర్, మీనా గౌడ్, ద్వారకా రవి, పాపయ్య, సదానంద చారి, బుర్ర ప్రవీణ్ యాదవ్, శ్రీనివాస్, సుధాకర్, లింగమూర్తి, చరక లక్ష్మీ, పవన్, తేజస్విని, రాములు, మరియు రైతులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

Vaasthava Nestham Telugu daily: Printed, Published Edited and Owned by: SYED QAMAR, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin Code: 504307, Printed at AR printers, Village: Adegonv ( K ), MDL: Ichoda, Dist: Adilabad, State: Telangana, Pin code: 504307, TITLE CODE: TELMUL/2023/85744, EDITOR: SYED QAMAR Contact Number: 8099779988, Email: vntelugudaily@gmail.com, vaasthavanestham.com